గుండెకు ప్రత్యామ్నాయం!

- మరో హృదయంలా మహాధమని
- కాలిఫోర్నియా శాస్త్రవేత్తల వెల్లడి



న్యూయార్క్, ఏప్రిల్ 16: హృదయానికి ప్రత్యామ్నాయంలా పనిచేసే ఓ అవయవాన్ని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. యార్టా (బృహద్ధమని లేదా మహాధమని) గుండెలా పని చేస్తుందని, రక్త ప్రసరణకు దోహదపడుతుందని తాజా పరిశోధనల్లో వెల్లడైంది. ఇది హృదయంపై భారాన్ని తగ్గిస్తుందని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలింది.

హృదయ వైఫల్య చికిత్సకు దోహదం...

బృహద్ధమనిని మహాధమని అని కూడా పిలుస్తారు. ఇది అతిపెద్ద రక్తనాళం. ఇన్నేండ్లు ఇది నిరుపయోగమైన రక్తనాళమని శాస్త్రవేత్తలు భావించారు. కానీ, తాజా పరిశోధనల్లో ఇది రక్త ప్రసరణలో (శుద్ధిచేయబడిన రక్తం) కీలకపాత్ర పోషిస్తున్నట్లు వెల్లడైంది. ఇది వేవ్ పంపింగ్ మెకానిజంలా పని చేస్తుందని, రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా ఉపయోగపడుతుందని పరిశోధనల్లో తెలిసింది. ప్రతి హృదయ స్పందన సమయంలో బృహద్ధమని శక్తిని నిల్వ చేసుకుంటుందని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ముఖ్యంగా పెద్ద వయస్కుల్లో రక్త ప్రసరణకు ఇది ఎంతగానో దోహదం చేస్తుందని తేలింది. అంతేకాదు, హృదయ వైఫల్యం జరిగినప్పుడు రక్త ప్రసరణ జరిగేలా ఇది సాయపడుతుందని వెల్లడైంది. కొంతమందిలో బలహీనమైన హృదయం కూడా సక్రమంగా ఎలా పని చేస్తుందో దీని ద్వారా తెలుసుకోవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రధాన ధమని ఎలాస్టిసిటిపై పరిశోధనలు చేయడం ద్వారా హృదయ వైఫల్యానికి మెరుగైన చికిత్సను కనుగొనవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు.

తదుపరి సీజేఐగా జస్టిస్ గవాయ్

- కేంద్రానికి సీజేఐ ఖన్నా సిఫార్సు
- మే 14న బాధ్యతల స్వీకరణ
- ఆరు నెలలకుపైగా పదవిలో..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: తదుపరి భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)గా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ పేరును సీజేఐ సంజీవ్ ఖన్నా బుధవారం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.సంజీవ్ ఖన్నా తర్వాత సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ గవాయ్. మే 13న సీజేఐ ఖన్నా పదవీ విరమణ చేయనుండగా 52వ సీజేఐగా జస్టిస్ గవాయ్ మే 14న పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. 2019 మే 24న సుప్రీంకోర్టుకు పదోన్నతిపై వచ్చిన జస్టిస్ గవాయ్ సీజేఐగా ఆరు నెలలకుపైగా కొనసాగుతారు. 2025 నవంబర్ 23న ఆయన పదవీ విరమణ చేస్తారు. జస్టిస్ కేజీ బాలకృష్ణన్ తర్వాత సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న రెండో దళిత న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ కావడం విశేషం.

పలు కీలక తీర్పులు..

1960 నవంబర్ 24న మహారాష్ట్రలోని అమ్రావతిలో జన్మించిన జస్టిస్ గవాయ్ 2003 నవంబర్ 14న బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2005 నవంబర్ 12న అదే హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనేక చరిత్రాత్మక తీర్పులను వెలువరించిన సుప్రీంకోర్టుకు చెందిన పలు రాజ్యాంగ ధర్మాసనాలలో జస్టిస్ గవాయ్ కూడా ఉన్నారు. పూర్వ జమ్మూ కశ్మీరు రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని 370 అధికరణను రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఏకగ్రీవంగా సమర్థించిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ గవాయ్ కూడా ఉన్నారు. రాజకీయ పార్టీలకు నిధులను సమకూర్చే ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసిన మరో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో కూడా జస్టిస్ గవాయ్ సభ్యుడిగా ఉన్నారు. రూ. 1000, రూ. 500 నోట్లను రద్దు చేస్తూ కేంద్రం 2016లో తీసుకున్న నిర్ణయాన్ని 4:1 మెజారిటీతో ఆమోదించిన మరో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో కూడా జస్టిస్ గవాయ్ పాత్ర ఉంది. ఎస్సీల వర్గీకరణ చేపట్టేందుకు రాష్ట్రాలకు అధికారాలను అందచేస్తూ 6:1 మెజారిటీతో తీర్పును వెలువరించిన ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో కూడా జస్టిస్ గవాయ్ ఉన్నారు. జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఓ ముఖ్యమైన తీర్పును వెలువరిస్తూ 15 రోజుల ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఏ ఆస్తినీ కూల్చరాదని ఆదేశిస్తూ దేశవ్యాప్తంగా మార్గదర్శకాలు జారీచేసింది. అడవులు, వన్యప్రాణులు, చెట్ల పరిరక్షణకు సంబంధించిన అంశాలను విచారించే ధర్మాసనాలకు ఆయన సారథ్యం వహిస్తున్నారు.

ఇక రైళ్లలోనూ ఏటీఎం సేవలు!

దేశంలోనే తొలిసారిగా

పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో ప్రారంభం

ముంబై. ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): నడిచే రైలు బండిలో నగదు అవసరమైతే ఎలా? అని చింతిస్తున్నారా? ఇప్పుడు ఆ బాధ అవసరం లేదు. భారతీయ రైల్వే ప్రయాణికుల కోసం రైళ్లలో ఏటీఎం సేవలను ప్రారంభించింది. దేశంలోనే తొలిసారిగా ముంబై- మన్మాడ్ పంచవటి ఎక్స్ ప్రెస్‌లో ప్రయోగాత్మకంగా ఏటీఎంను ఏర్పాటుచేశారు. భుషావల్ రైల్వే డివిజన్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర సంయుక్త సహకారంతో దీనిని ఏర్పాటు చేశారు. ఏటీఎం చక్కగా పనిచేసిందని రైల్వే అధికారులు తెలిపారు. నగదు ఉపసంహరణకే కాక, చెక్‌బుక్‌కు ఆర్డర్ ఇవ్వడానికి, ఖాతా స్టేట్‌మెంట్‌లు తీసుకోవడానికి కూడా ఈ ఏటీఎంను వినియోగించుకోవచ్చు. ఏసీ కోచ్‌తోపాటు మిగిలిన అన్ని కోచ్‌లవారు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు.

దస్తావేజులు లేకుంటే | వక్ఫ్ ఆస్తులు కాదంటారా?

మొదటిపేజీ తరువాయి...

సుప్రీంకోర్టు నిర్ణయాన్ని మార్చుకుని పిటిషనర్ల తరపున హాజరైన సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వీ, రాజీవ్ ధావన్‌తోసహా పలువురు న్యాయవాదులు, కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలను సుదీర్ఘంగా ఆలకించింది. ప్రస్తుతానికి లాంఛనంగా ఎటువంటి నోటీసు జారీచేయనప్పటికీ ఏప్రిల్ 17న(గురువారం) మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో పిటిషన్లపై విచారణను తిరిగి చేపడతామని ధర్మాసనం తెలియచేసింది.

హింసపై ధర్మాసనం ఆందోళన

వక్ఫ్ చట్టం ఆమోదం పొందిన తర్వాత దేశంలో జరుగుతున్న హింసాకాండ పట్ల ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. తాము విచారణకు స్వీకరించిన తరుణంలో ఈ హింస జరగడం ఆందోళనకరమని ధర్మాసనం పేర్కొంది. విచారణ సందర్భంగా ఎక్స్ అఫిషియో సభ్యులను మతాలకు అతీతంగా ఎవరినైనా ప్రభుత్వం నియమించుకోవచ్చని, కాని ఇతరులు మాత్రం ముస్లింలు మాత్రమే ఉండాలని ఉత్తర్వులు జారీచేస్తామని సీజేఐ ప్రతిపాదించారు.

పత్రాలు లేనంత మాత్రాన..

వక్ఫ్‌గా చాలా ఆస్తులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఉండకపోవచ్చని, అలాంటి పరిస్థితిలో వక్ఫ్ బై యూజర్‌ని ఎందుకు అనుమతించరని తుషార్ మెహతాను ధర్మాసనం ప్రశ్నించింది. యజమాని వద్ద వక్ఫ్‌కు సంబంధించి లిఖితపూర్వక పత్రాలు ఉండనప్పటికీ వాటి దీర్ఘకాల ఉపయోగాన్ని పరిగణనలోకి తీసుకుని మతపరమైన లేదా చారిటబుల్ ఎండోమెంట్(వక్ఫ్)గా ఆ ఆస్తులను గుర్తించడాన్ని వక్ఫ్ బై యూజర్‌గా వ్యవహరించడం ఆనవాయితీగా వస్తోంది. 'అటువంటి వక్ఫ్ బై యూజర్‌ను ఎలా రిజిస్టర్ చేస్తారు? వారి వద్ద ఏం డాక్యుమెంట్లు ఉంటాయి? ఇది మరొకరుకు దారితీయవచ్చు. కొంత దుర్వినియోగం జరగవచ్చు. కాని నిజమైనవి కూడా ఉంటాయి. వక్ఫ్ బై యూజర్‌ను గుర్తించినట్టు బ్రిటిష్ కాలం నాటి తీర్పులను నేను చదివాను. వక్ఫ్ బై యూజర్‌ను తొలగిస్తే అది సమస్యగా మారుతుంది. చట్టసభ ఏ తీర్పును, ఉత్తర్వును లేదా డిక్రీని గాలిలోకి ప్రకటించలేదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కాగా, వక్ఫ్ చట్టం తమకు వద్దని చాలా మంది ముస్లింలు కోరుకుంటున్నట్లు తుషార్ మెహతా ధర్మాసనానికి విన్నవించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ 'హిందూ ధార్మిక బోర్డులలో భాగస్వాములుగా ముస్లింలను కూడా ఇప్పటి నుంచి అనుమతిస్తున్నామని మీరు చెబుతున్నారా? సూటిగా బయటకు చెప్పండి' అంటూ మెహతాను ప్రశ్నించింది.

ఎలా స్వాధీనం చేసుకుంటారు?

100 లేదా 200 సంవత్సరాల క్రితం వక్ఫ్‌గా ఓ పబ్లిక్ ట్రస్టును ప్రకటిస్తే హఠాత్తుగా దాన్ని వక్ఫ్ బోర్డు స్వాధీనం చేసుకుని అది వక్ఫ్ కాదని ప్రకటించలేదని ధర్మాసనం స్పష్టం చేసింది. గతాన్ని మీరు తిరిగిరాయలేరు అంటూ కేంద్రం తరపున హాజరైన మెహతాకు ధర్మాసనం స్పష్టం చేసింది. సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) 28 సార్లు సమావేశమై 98.2 లక్షల వినతిపత్రాలను పరిశీలించిన తర్వాత ఇచ్చిన నివేదికను ఆధారం చేసుకుని రూపొందించిన వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదించాయని మెహతా తెలిపారు.

విచారణకు తీసుకోవాలా, వద్దా?

విచారణ ప్రారంభంలో సీజేఐ మాట్లాడుతూ ఉభయ పక్షాలను తాను రెండు అంశాలను అడగదలచుకున్నానని చెప్పారు. ఈ పిటిషన్లను తాము స్వీకరించాలా లేక హైకోర్టుకు నివేదించాలా అన్నది మొదటి అంశం కాగా నిజంగా ఈ పిటిషన్లను మేము విచారణకు తీసుకుంటే చిత్తశుద్ధితో వాదించాలని మీరు కోరుకుంటున్నారా అని సీజేఐ ఇరుపక్షాలను ప్రశ్నించారు. పిటిషన్లను విచారణకు స్వీకరించేందుకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని కూడా సీజేఐ స్పష్టం చేశారు.

ముస్లిం అవునో కాదో రాజ్యం నిర్ణయించలేదు

పిటిషనర్ల తరపున హాజరైన కపిల్ సిబల్ జవాబిస్తూ వక్ఫ్ సవరణ చట్టాన్ని ప్రస్తావించారు. ముస్లింలు మాత్రమే వక్ఫ్‌ను సృష్టించగలరన్న చట్టంలోని నిబంధనను తాము సవాలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. తాను ముస్లింనో కాదో, వక్ఫ్‌ను సృష్టించడానికి తాను అర్హుడినో కాదో రాజ్యం ఎలా నిర్ణయిస్తుందని ఆయన ప్రశ్నించారు. గడచిన ఐదేళ్లుగా ఇస్లాంను పాటిస్తున్న వారు మాత్రమే వక్ఫ్‌ను సృష్టించగలరని ప్రభుత్వం ఎలా అనగలదని కొందరు పిటిషనర్ల తరపున హాజరైన మరో సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ప్రశ్నించారు. వక్ఫ్ చట్టం దేశవ్యాప్తంగా ప్రభావం చూపగలదని, ఈ పిటిషన్లను హైకోర్టుకు నివేదించరాదని ఆయన ధర్మాసనాన్ని అభ్యర్థించారు. మరో సీనియర్ న్యాయవాది హజేఫా అహ్మదీ వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ వక్ఫ్ బై యూజర్ అన్నది ఇస్లాంలో ఎప్పటి నుంచో ఉన్న ఆనవాయితీ అని, దాన్ని ఇప్పుడు తొలగించలేరని వాదించారు. పార్లమెంట్ ఉభయ సభలలో తీవ్ర వాగ్వివాదాల తర్వాత ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏప్రిల్ 5న ఆమోదం తెలియచేయడంతో వక్ఫ్ (సవరణ) చట్టం, 2025ని కేంద్రం ఇటీవలే నోటిపై చేసింది. వక్ఫ్ చట్టాన్ని సవాలు చేస్తూ ఐఎంఐఎం నాయకుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, జామియత్ ఉలామా ఇ హింద్, ద్రవిడ మున్నేట్ర కళగం(డీఎంకే), కాంగ్రెస్ ఎంపీలు ఇమ్రాన్ ప్రతాప్‌గఢి, మొహమ్మద్ జావేద్‌తో సహా వివిధ వ్యక్తులు, సంస్థలు దాదాపు 172 పిటిషన్లను సుప్రీంకోర్టులో దాఖలు చేశాయి. కాగా, ఈ పిటిషన్లపై ఉత్తర్వులు ఏవీ జారీ చేయడానికి ముందు తమ వాదన వినాలని కోరుతూ కేంద్రం ఏప్రిల్ 8న సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేసింది.

క్యాడ్‌బరీ జెమ్స్‌లా డోలో 650 వాడకం

భారతీయుల తీరుపై డాక్టర్ వ్యాఖ్య.. వైరల్

న్యూఢిల్లీ: భారతీయులు డోలో 650 మాత్రలను క్యాడ్‌బరీ జెమ్స్‌లా తినేస్తున్నారని గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, హెల్త్ ఎడ్యుకేటర్ పలనియప్పన్ మానిక్కం సామాజిక మాధ్యమంలో వ్యాఖ్యానించారు. ఇది వైరల్‌గా మారింది. తమ ఇంటిలోనూ ఇదే పరిస్థితి అని చాలా మంది కామెంట్లు పెట్టారు. కొవిడ్-19 మహమ్మారి వచ్చినప్పటి నుంచి ఈ మాత్రల వాడకం పెరిగింది. జ్వరం, తలనొప్పి, ఒళ్ల నొప్పులు తగ్గడానికి వైద్యులు దీనిని సూచిస్తారు. అయితే ఇందులోని పారాసిటమాల్‌తో కిడ్నీ, కాలేయం దెబ్బతింటాయి. వైద్యులు సూచించిన మోతాదులోనే వాడాలి. కొవిడ్-19 మహమ్మారి సమయంలో టీకాలను తీసుకున్న తర్వాత సైడ్ ఎఫెక్ట్స్‌ను ఎదుర్కొనడం కోసం పారాసిటమాల్‌ను వాడాలని వైద్యులు చెప్పేవారు. 2020లో మైక్రో ల్యాబ్స్ 350 కోట్లకుపైగా డోలో 650 మాత్రలను విక్రయించి, ఓ సంవత్సరంలోనే రూ.400 కోట్లు సంపాదించింది. మార్కెట్ పరిశోధన సంస్థ ఐక్యూవీఐఏ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ మహమ్మారి రావడానికి ముందు మైక్రో ల్యాబ్స్ ఏటా 7.5 కోట్ల డోలో 650 స్ట్రిప్‌లను విక్రయించేది. 2021 చివరినాటికి 14.5 కోట్ల స్ట్రిప్స్‌ను విక్రయించింది.

వచ్చే వారం భారత్‌కు వాన్స్ దంపతులు

వాషింగ్టన్ : అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఆయన సతీమణి ఉషా వాన్స్ వచ్చే వారం భారత్‌ను సందర్శించనున్నట్లు ఆయన కార్యాలయం బుధవారం ప్రకటించింది. వాన్స్, ఆయన కుటుంబం ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 24 వరకు ఇటలీ, భారత్‌లో పర్యటించనున్నారు. ఆర్థిక భాగస్వామ్యం, భౌగోళిక రాజకీయ పరిస్థితులను ఉపాధ్యక్షుడు ఆయా దేశాల నాయకులతో చర్చిస్తారని ఉపాధ్యక్ష కార్యాలయం తెలిపింది. భారత పర్యటనలో ప్రధాని మోదీతో వాన్స్ సమావేశమవుతారని, న్యూఢిల్లీ, జైపూర్, ఆగ్రాను సందర్శిస్తారని ఆయన కార్యాలయం పేర్కొన్నది.

ఇద్దరు మావోయిస్టు నేతల ఎన్‌కౌంటర్

ఛత్తీస్‌గఢ్ కొండగావ్‌లో ఘటన

మృతులపై 13 లక్షల రివార్డు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఏప్రిల్ 16 : భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టు నేతలు మృతిచెందారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని కొండగావ్ జిల్లాలో చోటు చేసుకుంది. బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగం మీడియాకు వివరాలు వెల్లడించారు. జిల్లా సరిహద్దు కిలమ్-బూర్గుమ్ అడవుల్లో జిల్లా రిజర్వు గార్డ్స్(డీఆర్‌జీ), బస్తర్ ఫైటర్స్ సంయుక్తంగా మంగళవారం సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడి జవాన్లపైకి కాల్పులు జరిపారు. 30 నిమిషాలకు పైగా భీకరపోరు జరిగింది. తర్వాత జవాన్లు ఆ ప్రాంతాన్ని పరిశీలించి, ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలతో పాటు ఒక ఏకే-47 రైఫిల్, ఇతర ఆయుధ వస్తు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మృతిచెందిన వారిలో మోస్ట్ వాంటెడ్ తూర్పు బస్తర్ డివిజన్ కమాండర్, డీవీసీఎం హల్దార్ కశ్యప్, ఏరియా కమిటీ సభ్యుడు రామే ఉన్నట్లు ఐజీ పాటిలింగం వెల్లడించారు. కశ్యప్ తలపై రూ.8 లక్షలు, రామేపై రూ.5 లక్షల రివార్డు ఉన్నట్లు నిర్ధారించారు.

విదేశీ విద్యపై తగ్గుతున్న మోజు!

యూఎస్, యూకే, కెనడాకు వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16: విదేశాలకు వెళ్లి చదువుకొనే భారతీయ విద్యార్థుల సంఖ్య ఐదేండ్లలో మొదటిసారి తగ్గుముఖం పట్టింది. భారతీయ విద్యార్థుల్లో అధిక భాగం అమెరికా, కెనడా, బ్రిటన్ దేశాలకు వెళ్తుంటారు. అయితే ఈ ఏడాది ఈ దేశాలకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా తగ్గినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2024లో ఈ మూడు దేశాల నుంచి భారతీయ విద్యార్థులకు లభించే స్టూడెంట్ వీసాల్లో 25 శాతం తగ్గుముఖం పట్టింది. అమెరికాకు వెళ్లే వారి సంఖ్య 34 శాతం, బ్రిటన్‌కు వెళ్లే వారి సంఖ్య 26 శాతం, కెనడాకు వెళ్లేవారి సంఖ్య 32 శాతం తగ్గింది. కెనడాకు వెళ్లేవారి సంఖ్య 2.78 లక్షల నుంచి 1.89 లక్షలకు తగ్గినట్టు ఇమిగ్రేషన్ వర్గాలు తెలిపాయి. విద్యార్థులకు అమెరికా ఇచ్చే ఎఫ్-1 వీసాల సంఖ్య 1,31,000 నుంచి 86,110కి తగ్గింది. ఆయా దేశాల్లో వలస నిబంధనలు కఠినతరం కావడం వల్లనే ఈ మార్పు వచ్చినట్టు తెలుస్తున్నది. మరోవైపు కెనడా, భారత్ మధ్య ఉద్రిక్తతలు నెలకొనడం ఈ పరిస్థితికి తోడైంది. గృహ, ఆరోగ్య, ఇతర సేవలు భారంగా మారుతున్నాయన్న సాకుతో 2026 నాటికి విదేశీ విద్యార్థుల సంఖ్యను ఐదు శాతం తగ్గించాలని కెనడా నిర్ణయించింది. బ్రిటన్ కూడా విదేశీ విద్యార్థులు తమపై ఆధారపడే వారిని (డిపెండెంట్స్‌ను) తీసుకురాకుండా నిబంధనలు విధించింది. దీంతో ఆ దేశానికి కూడా వీసాకు దరఖాస్తు చేసుకొనే వారి సంఖ్య తగ్గింది. నిజానికి గత పదేండ్లలో ఈ మూడు దేశాలకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగింది. 2022, 23లో భారతీయులు చైనాను దాటేశారు కానీ 2024లో మళ్లీ తగ్గిపోయారు.

ఐసీయూలో ఉన్న ఎయిర్‌హోస్టెస్‌పై లైంగిక దాడి

యూపీలో దారుణం

గురుగ్రామ్: ఉత్తరప్రదేశ్‌లో దారుణం చోటుచేసుకుంది. వెంటిలేటర్ సహాయంతో చికిత్స పొందుతున్న ఎయిర్‌హోస్టెస్ (46)పై లైంగిక దాడి జరిగింది. గురుగ్రామ్ పోలీసులకు ఆమె ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం, బాధితురాలు ఎయిర్‌లైన్ శిక్షణ కోసం గురుగ్రామ్ వచ్చారు. ఆమె బస చేసిన హోటల్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో మునిగిపోవడంతో ఆమెను ఓ దవాఖానలో చేర్చారు. అనంతరం ఈ నెల 6న మరో దవాఖానకు తరలించారు. అక్కడ ఆమె వెంటిలేటర్‌పై స్పృహ కోల్పోయిన స్థితిలో ఉండగా, దవాఖాన సిబ్బంది ఆమెను అనుచితంగా తాకినట్లు ఆమె గుర్తించారు. అయితే, నిస్సహాయ స్థితిలో ఉన్నందువల్ల ఆమె గట్టిగా అరవడం కానీ, నిరోధించడం కానీ చేయలేకపోయారు. ఈ లైంగిక దాడి జరిగినపుడు ఆమె వద్ద ఇద్దరు నర్సులు ఉన్నారు. కానీ వారు జోక్యం చేసుకోలేదు. ఈ నెల 13న ఆమెను దవాఖాన నుంచి ఇంటికి పంపించారు. ఆమె తన భర్తకు జరిగిన విషయాన్ని తెలిపారు.

విమాన ఖర్చులు ఇస్తాం.. వెళ్లిపోండి

అక్రమ వలసదారులకు ట్రంప్ ఆఫర్

వాషింగ్టన్: అక్రమ వలసదారులకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ ఆఫర్ ఇచ్చారు. స్వచ్ఛందంగా దేశం వీడాలనుకొనే వారికి విమాన టికెట్లు కొనిస్తాం, ఖర్చులకు కొంత డబ్బు కూడా ఇస్తామని ప్రకటించారు. మంగళవారం ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ అమెరికాలో అక్రమ వలసదారులకు స్వచ్ఛందంగా దేశాన్ని వీడే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా అలా వెళ్లేవారికి విమాన చార్జీలతో పాటు ఖర్చులకు కొంత మొత్తం ఇస్తామని చెప్పారు. వారు మంచిగా ఉంటే, మేము వారిని తిరిగి దేశానికి తీసుకురావాలనుకుంటే, వీలైనంత త్వరగా వారిని దేశంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తామని, భవిష్యత్‌లో వారితో కలిసి పనిచేస్తామని ట్రంప్ తెలిపారు. హోటళ్లు, పాలాలకు అవసరమైన కార్మికులను పొందడంలో సహాయం చేయాలనుకుంటున్నానని, అవసరమైన ఆ స్థానాలను భర్తీ చేయడానికి సిఫార్సు చేయాలనుకుంటున్నానని ఆయన చెప్పారు. ఇప్పుడు స్వచ్ఛందంగా వెళ్లిపోయిన వారే తమ దేశానికి అవసరమైనప్పుడు అధికారికంగా దేశంలోకి రావచ్చునని ట్రంప్ పేర్కొన్నారు.

కర్ణాటక కాంగ్రెస్‌లో కులగణన చిచ్చు

- సీఎం సామాజికవర్గానికి ప్రాధాన్యమిచ్చారని ఆరోపణలు
- నివేదికను వ్యతిరేకిస్తున్న లింగాయత్‌లు, వొక్కలిగ నేతలు

బెంగళూరు, ఏప్రిల్ 16: కర్ణాటక కాంగ్రెస్‌లో కులగణన నివేదిక చిచ్చురేపింది. నివేదికపై పార్టీ నేతల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీఎం సిద్ధరామయ్య సామాజిక వర్గం కురుబలకు అనుచిత ప్రాధాన్యం కల్పించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీలోని లింగాయత్, వొక్కలిగ నేతలు ఈ నివేదికను వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో 17న మంత్రివర్గం సమావేశమై కులగణన నివేదికపై చర్చించనుంది.

లింగాయత్, వొక్కలిగ నేతల్లో ఆందోళన

కుల గణనకు సంబంధించిన నివేదికను ఈ నెల 11న రాష్ట్ర మంత్రివర్గం ముందు ఉంచారు. ఆ నివేదిక ప్రకారం ప్రస్తుత అంచనా కన్నా 38 శాతం అధికంగా రాష్ట్రంలో ఓబీసీల సంఖ్య 69.6 శాతం ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో వొక్కలిగలు, లింగాయత్‌లు 3ఏ, 3బీ క్యాటగిరీల కింద ఓబీసీ రిజర్వేషన్లు 12.2 శాతం, 13.6 శాతం అనుభవిస్తున్నారు. జనాభా పరంగా వీరి సంఖ్య 17 శాతం, 15 శాతం ఉండవచ్చునని అంచనా కాగా, అంతకన్నా తక్కువగా వీరి సంఖ్య నమోదైంది. అయితే ప్రస్తుత కుల సర్వే 4 శాతం పాయింట్లను పెంచుతూ వీరిని 2బీ క్యాటగిరీ కింద ఉంచాలని సిఫార్సు చేసింది. దీంతో వొక్కలిగ, లింగాయత్‌లకు రిజర్వేషన్లలో మూడు శాతం పెరిగి స్వల్ప ప్రయోజనం ఏర్పడనుంది. అయితే ఓబీసీ వర్గాల కోటా పెంచుతూ నివేదిక సిఫార్సు చేయడం.. ఇంతకాలం రాజకీయాల్లో పూర్తి ఆధిపత్యం వహిస్తూ వచ్చిన వొక్కలిగ, లింగాయత్ వర్గాల్లో ఆందోళనకు దారి తీసింది. ఊహించిన దాని కన్నా అత్యధికంగా ఉన్న ఓబీసీలకు కోటా పెంపు వల్ల జనాభా ప్రాతిపదికన మిగిలిన వర్గాలకు సీట్ల కేటాయింపు పెరుగుతుందని, తద్వారా తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల టికెట్లు గల్లంతయ్యే అవకాశం ఉందని ఆ వర్గం నేతలు ఆందోళన చెందుతున్నారు.

వొక్కలిగ నేతలతో డీకే భేటీ

తాజా పరిణామాలతో కాంగ్రెస్‌లో వొక్కలిగల ఆధిపత్యం ఏమాత్రం తగ్గకూడదని ఆ వర్గానికే చెందిన డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ భావిస్తున్నారు. ఈ మేరకు ఆయన ఆ వర్గ ఎమ్మెల్యేలు, నేతలతో రహస్య సమావేశం నిర్వహించారు. కాగా, కుల సర్వే అంతా ఫార్సుగా బీజేపీ కొట్టిపారేసింది. ఇది మైనారిటీలను బుజ్జగించడానికి కాంగ్రెస్ చేసిన సర్వే అని, అందులోని అంకెలన్నీ సీఎం సిద్ధరామయ్య చెప్పినవేనని బీజేపీ నేత ఆర్ అశోక ఆరోపించారు.

ముడా కేసులో సిద్ధరామయ్య దంపతులకు నోటీసులు

బెంగళూరు : 'ముడా' కేసులో సీఎం సిద్ధరామయ్య దంపతులు సహా మరికొంతమందికి కర్ణాటక హైకోర్టు నోటీసులు జారీచేసింది. ఈనెల 28లోగా తమ స్పందన తెలియజేయాలని ఆ నోటీసులో పేర్కొన్నది. ముడా కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని కోరుతూ ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌ను గతంలో హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం తిరస్కరించింది. అయితే, దీన్ని సవాల్ చేస్తూ ఆయన తిరిగి పిటిషన్ వేశారు. బుధవారం ఈ పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపిన నోటీసులు ఇచ్చింది.

సివిల్ తగాదాకు క్రిమినల్ కేసా?

యూపీ ప్రభుత్వంపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: సివిల్ వివాదాన్ని క్రిమినల్ కేసుగా మార్చి ఎఫ్ఐఆర్ నమోదు చేసినందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు ఉత్తరప్రదేశ్ పోలీసులకు రూ.50 వేల జరిమానా విధించింది. గతంలో ఇచ్చిన తీర్పులను ఉల్లంఘించి పోలీసులు సివిల్ వివాదాల్లో సైతం క్రిమినల్ కేసులు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ పలు పిటిషన్లు సుప్రీంకోర్టుకు వెల్లువెత్తుతున్నాయని న్యాయస్థానం పేర్కొంది. 'సివిల్ కేసులకు క్రిమినల్ కేసులు చేయడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు' అని సీజేఐ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొన్నది.

ఎక్స్‌కు పోటీగా ఓపెన్‌ఏఐ సోషల్‌మీడియా

న్యూఢిల్లీ: 'ఎక్స్' వంటి సోషల్‌మీడియా నెట్‌వర్క్‌ను తీసుకురావటంపై 'ఓపెన్‌ఏఐ' కసరత్తు చేస్తున్నట్టు వార్తలు వెలువడ్డాయి. సంస్థ తీసుకురాబోతున్న సోషల్ మీడియా అప్లికేషన్ ప్రాథమిక నమూనాపై 'చాట్‌జీపీటీ' దృష్టిసారించిందని అమెరికా న్యూస్ వెబ్‌సైట్ 'ద వెర్జ్' కథనం పేర్కొన్నది. ఓపెన్‌ఏ